శ్రీ వివినమూర్తి

# వంకర చూపులు

మళ్ళీ చలికాలం వచ్చేస్తోంది –

నేలమీదే పడుకుంటారు పిల్లలు –

నిద్రలో వణుకుతారు! చలి భరించలేక ఏడుస్తారు.

మధ్యాహ్నం రెండూ మూడూ మధ్య ఖాళీలో సీత యీ విషయాలు తరచు గుర్తు చేసుకుంటోంది. ఆ రోజు మంచం కింది బట్టలి పెట్టె ఆపసోపాలు పడుతూ బయటకు లాగింది.

ఓ చీర ఎపుడో ఎంచింది. పైన వేసేది కాస్తంత గట్టిగుడ్డ అయితే నాలుక్కాలాలు వుంటుంది. కట్టు విడుపు చీరలే బయట కూడా వాడుకుంటోంది. అవయినా లెక్కగా మూడే మూడున్నాయి. అందులో ఒకటి తీసి వాడేస్తే...?

ముసలమ్మ దగ్గర పాత బొంత ఉంది. మంచం ఎలాగూ ఉంది గదా! ఆ బొంత పిల్లలకి యివ్వగూడదా—అనుకుంటూంటుంది సీత. అసలే ముసలి ప్రాణం! ఆ పట్టెడకి అన్నీ ముళ్ళే! పోన్లెస్తూ – అంతలోనే సర్దుకుంటూంటుంది.

"సీతా!" అన్న అత్తగారి గొంతు వినిపించగానే –

"వస్తున్నానత్తయ్యా!" అంటూనే వెళ్ళి భుజాన బిందెతో మెట్లు ఎక్కలేకపోయిన చిట్టెమ్మని చూస్తూ "అయ్యయ్యో! మీ కెందుకండీ యీ అవస్థ..." అంటూ దింపింది.

"నువ్వు మాత్రం ఒట్టి మనిషివిటే! ఈ మాయరోగం తగలడ్డాక యింటెడు చాకిరీ నీపరమేనాయె!" అంటూ సాయంపట్టింది.

"యిహ చాల్లెస్తురూ! యీ పూటకి గడిపేసుకుందాం! తెల్లారగట్ల కుళాయి ఎలాగూ వస్తుంది! చల్ల పొద్దున తెచ్చుకోడం సులువు!"

"సరిలేమరి! ఏనాడు నా మాట పడనిచ్చావు గనక..." నవ్వు.

మంచం వాల్చుకుంది చిట్టెమ్మ!

"తల్లీ! కాస్తంత సాయం పడుదూ! కుక్కిలో... ఛస్తున్నానూ!"

నల్లుల్ని చంపుతూ పట్టెడకి ముళ్ళువేస్తూ బిగించేసరికి గంట పట్టింది. ఇంతలో కిష్టుడులేచి ఊరూవాడా పోగయేటట్టు ఆరున్నొక్క రాగం అందుకున్నాడు. వాడికి పాలు కలిపి యిచ్చి కాసిన్ని మరమరాలు ముందరపోసింది.

"ఈరోజు కూడా తెమలలేదు..." బట్టలపెట్టె మంచం కిందకి తోస్తూ నిట్టూర్చింది సీత.

## 2

ఆ పని పూర్తవటానికి రెండు నెలలు పట్టింది. ఓ మాదిరి గట్టిచీర తెగించి వాడేసింది. అత్తగారు కూడా ఓ చిరుగుల పంచె యిచ్చారు. నెలలు పైబడుతున్నాయేమో – ఆఖరి రోజులలో వంగి సరిచేస్తూ కుట్టడానికి – మరింత శ్రమ అయింది.

అయితే అయిందిలే! బొంత ఒత్తుగా బావుంది –

ఒత్తి ఒత్తి చూస్తోంది సీత. పిల్లలు అందుమీద పడుకొనే దృశ్యం ఆమె కళ్ళలో కదులోతోంది.

"సీత పిన్నీ! సీత పిన్నీ! మీ ఆడబడుచు..." పక్కింటి అమ్మాయి అరుచుకుంటూ వచ్చింది.

మాగన్నుగా పడుకున్న చిట్టెమ్మ గబుక్కున లేచింది. తల మీద పంచె చెంగు సవరించుకుని వీధిలోకి నడిచింది. రిక్షాను పంపి, మెట్లు ఎక్కుతోంది మాలక్ష్మి.

ఏదో బరువు నెత్తిన ఉన్న అలసట ఆమె ముఖంలో తాండవిస్తూంటుంది. ఓ పిల్లాడు భుజానా, ఓ పిల్ల వెనకనా ఉంటేగాని ఆమె బొమ్మ పూర్తయినట్టు ఉండదు! ఆమె భర్త స్కూల్లో అటెండరు.

వదినా మరదళ్ళు మంచీ చెడ్డా కలబోసుకుంటూ లోపలికి వచ్చారు. యిరుగమ్మల పొరుగమ్మల పలకరింపులతో కాస్సేపు గది నిండింది. కూతురు చిక్కిపోయిందనీ, అల్లుడు అలాంటివాడయాడనీ పదే పదే అంది చిట్టెమ్మ.

"అవును వదినా! యీ బొంత నువ్వే కుట్టావూ?" వదినగారి ఎనిమిదో నెల గర్భం వంక చూస్తూ మెచ్చుకోలుగా అంది మాలక్ష్మి.

"లేదమ్మా! మీ అమ్మగారు కుట్టారు..." మడతపెడుతూ అంది.

"అనవే! అనవే! ఇక్కడ పూతికపుల్లతీసి అక్కడ పెట్టటం తేదనేగా నీ వేళాకోళం...!"

"బావుంది! తల్లీ కూతురూ వేళాకోళా లాడుకుంటే చెల్లుతుంది గానీ...ఎంత అయిందయినా కోడలు కోడలే...!"

"వెనకటికి ఎవరో చెప్పార్లేవే ...! అత్తలు పెట్టిన ఆరళ్ళు అవుపిస్తాయి గానీ ... కోడళ్ళుచేసే కొంటెపనులు అవుపడవుట...!"

మాలక్ష్మి వచ్చినపుడు చిట్టెమ్మలో ఓ విధమయిన మార్పు వస్తుంది. తల్లీకూతురూ ఆసమ్మ బూసమ్మ కబుర్లు చెప్పుకుంటూ గడిపేస్తారు! అంతకు ముందు ఆపాటీ యీపాటి సాయంజేసే అత్తగారు – ఉదయం వంట మినహా మరేమీ ముట్టుకోకపోడం – సీతకి కష్టంగా ఉంటుంది. తోటి ఆడది కాలుమీద కాలేసుకుని కూర్చుని అనుర్చి పెడుతున్నవన్నీ ఆరగిస్తూ ఎంగిలి కంచాలయినా ఎత్తకపోతే ఆడది పడే బాధ అనుభవించాల్సిందే! అలాంటపుడే సీతకి – యీావిడ ఎప్పుడూ యింతేలెస్తూ – అన్న చిరాకు కలుగుతుంటుంది.

బడి నుంచి వచ్చిన పిల్లల్తో చిల్లో బొల్లోమంటూ కల్సిపోయారు మాలక్ష్మి పిల్లలు. తల్లీ కూతురూ పెద్ద పట్టె మంచం మీద చేరారు.

సరిగా మండని కట్టెలతో వంట చేస్తున్న సీతకి వాళ్ళకబుర్లు చెవిన పడుతున్నాయి.

తను గడుసుదిట! ఎందుకట?

అన్నీ ఒబ్బిడి చేసుకుంటుందిట!

ఆడబడుచు మనసు మంచిదే! తనంటే గురి కూడా! అత్తగారే అన్నీ నేర్పిపెడుతుంది.

సొంత చెల్లెలుకన్న యిదిగా ఒకటికి రెండుమార్లు పని ఒబ్బిడి గూర్చి చెప్పింది. కాఫీలు కలపటానికే గంట తీసుకుంటుంది. అంతసేపూ కుంపటి ముందు కూర్చునే ఉంటుంది! ఓ బియ్యం ఏరుకోడమో, కూర తరుక్కోడమో చెయ్యొచ్చా? చెయ్యదు! కాఫీ పొడుం డబ్బాతో సహా అన్నీ కుంపటి చుట్టూ ఉంటాయి! తీసిన వస్తువు వెంటనే దాచదు. వంట వేళకి మొత్తం డబ్బాలన్నీ కిందేఉంటాయి! నడుస్తుంటే ఏదో తన్నేస్తుంది! కేజీ సరిపోయేది మరో అరకేజీ అవదా మరి! భర్త వస్తాడు. శుభ్రమైన చీరగట్టుకుని ఎదురెళ్ళిన పాపాన పోలేదు ఒక్కమారయినా. పిల్లలున్నపుడూ అంతే! లేనపుడూ అంతే! ఏబ్రాసికి పనెక్కువ అన్న సామెత ఊరికినే పుట్టలేదు!

ఇవన్నీ మార్చుకోమని చెపితే మాలక్ష్మి ఏమీ అనుకున్నట్టుండదు గానీ, – తన పెంపకాన్ని తప్పు పడుతుందా – అన్నట్టు చిట్టెమ్మలో చిరాకులు పరాకులూ ఎక్కువయి పోతుంటాయి!

## 3

విజయనగరంలో పెళ్ళిట. భర్త ముందస్తుగా పంపించాడు. మ్రొరెండు రోజులు ముందుగా బయల్దేరి పుట్టింటిదగ్గర ఉండొచ్చని వచ్చిందిట మాలక్ష్మి. చెల్లెలు అర్థాంతరపు రాకలో అంతరార్థం తెలిసాక కాస్త తేలికపడ్డాడు రాఘవరావు.

మాధవుడు గడపలోకి అడుగుపెట్టేసరికి అన్నాచెల్లెలూ తల్లీ కబుర్లు చెప్పుకుంటున్నారు. మాలక్ష్మి వచ్చి పదో రోజు.

వస్తూనే –

"నివ్వెప్పు డొచ్చావే...?"

చెప్పి –

"అవునుగానీ ఒరే చిన్నన్నయ్యా! వాడికంటే కుదర్దు! నీకేంరా? ఉత్తరమ్ముక్కయినా రాయవూ! అదేమో మా మరిది ఎంప్లాయమెంట్ కార్డు వ్యవహారమాయె! ఆయంజూస్తే తిక్కమనిషి! మీ అన్నలున్నారన్న మాటేగాని ... పిసరంత ఉపయోగం లేదూ అనివో యిదవుతుంటారు!"

"మొదలెట్టావా తల్లీ! అక్షింతలు ...! చూస్తున్నావుగా! పది రోజులకి యిదిగో యిదీ యింటి మొహం చూట్టం!"

అతను సినిమా రిప్రజెంటేటివ్! అతని సంపాదన అతనికే చాలదు. మాలక్ష్మికి చిన్నన్నయ్య నచ్చడు. వాళ్ళది దగ్గర కానుపు. దాంతో ఇద్దరూ చనువుగా తిట్టుకుంటూంటారు!

మాధవుడు లోపలికి వెళ్ళాడు.

"వదిన కుట్టిన కొత్త బొంత చాలా బావుందంటోందిరా అదీ ..."

"కావాలంటే తీసికెళ్ళమనూ! పాత గుడ్డేగా!"

"పోన్లేరా! వదిన ఏవనుకుంటుందో ఏవిటో!"

"ఏం? ఏవనుకుంటుందేవిటి? దాని అన్నగారి సొమ్మ అది తీసికెళ్ళిందనుకుంటుంది!"

"పోనీ ఓమారు దాన్ని కూడా అడగరాదుట్రా...."

"ఏం మారు భాగ్యమనీ? దాన్ని అడగటం..."

మాధవుడు బట్టలు మార్చుకుని వచ్చి వాళ్ళ సంభాషణలో కలగజేసుకున్నాడు.

"ఏవిటోయ్...? అప్పుడే ఏదో వడకటం మొదలెట్టావ్...?"

మాలక్ష్మి మొహం నయాపైసా అయిపోయింది.

"వాడు చూస్తే ధర్మరాజు! నువ్వేమో యమధర్మరాజు! నీకు బొత్తిగా వేళాపాళా మంచీ చెడ్డా వుండవు వేళాకోళాలకు! అదేం వడికేసుకుందనీ...?"

అన్నగారు కూడా తల్లికి వత్తాసయాడు.

"ఒక్కగానొక్క ఆడపిల్ల! చూస్తూ చూస్తూ అలాంటాడికి కట్టబెట్టాం! దాని ముద్దూ ముచ్చటా చూడ్డవేఁ లేదు! అవసరాలకు అడ్డుపడ్డవూఁ లేదు! ఏదో పాతగుడ్డల బొంతకు...అదీ అవసరం కొద్దీ అడిగితే...! తప్పరా అబ్బాయా!"

అన్నగారు వదినతో చెప్పపని లేదన్నా మాలక్ష్మి ఉండబట్టలేకపోయింది. ఆరోజు సాయంకాలం వదినతో చూచాయగా అంది.

"నాకూ ఓ బొంత కావాలి వదినా?"

సీత నింపాదిగా చెప్పింది –

"ఈమాలోనా పుగా ! ఏనయినా పాత గుడ్డలుంటే యిక్కడ పడెయ్యి ! నేకూడా ఏదో చూస్తాను. అప్పటికి నేనూ తెరిపిన పడిపోతాను ! వారం రోజుల్లో బొంత తయారయిపోతుంది."

ఆ ముక్కకి చిట్టెమ్మ తెగగింజుకుంది.

"నేం చెప్పలేదుటే ! ఏ ఆడబడుచంటే ఎవత్తెకి పడింది ? నువ్వేమో వెర్రిబాగుల్దానిలా దాని కాళ్ళా వేళ్ళా బడ్డం... ! అదేమో అశుద్ధంమీద పురుగుని తీసేసినట్టు తీసెయ్యడం ..." అంది రహస్యంగా.

## 4

పదకొండయింది. మాధవుడు చప్పుడుకి లేచాడు. మంచం కింది పెట్టె లాగుతోంది మాలక్ష్మి. బొంత అందులోనే వుంది.

"వదిన్ని అడిగావా ?"

"లేదు !"

"ఎంచేత ?"

"అక్కర్లేదంది అమ్మ !"

"ఎందుకందూ? వస్తువ వదినది. అడిగితీసుకోటం మర్యాద. అడక్కుండా తీసుకోటం దొంగతనం !"

"ఏవిట్రా నీ గొడవ !" అంది విసుగ్గా.

"తేరగా దొరికితే అబ్బో ! మీ అమ్మ దానమూ చేస్తుంది. నిప్పు పట్టుకెళ్ళిపోతావూ..." అన్నాడు రాగం తీస్తూ.

– ఆ మాటకి మాలక్ష్మికి పౌరుషం వచ్చింది.

"నేనీ యింటికి ఆడబడుచుని! ఏంటనుకుంటున్నావో ఏంటో! రేప్పొద్దుట నీ పెళ్ళాం వస్తుంది! దాన్ని కూడా అడగను! నాక్కావల్సినవి పట్టుకెళ్తా ! ఎలా అడ్డొస్తావో చూస్తా !"

మడిమీదున్న చిట్టెమ్మ వంట గదిలోంచి వచ్చింది.

"ఏవిట్రా ! నీ వెధవముండా ధాష్టీకం ?"

"అదికాదే ! వదిన్ని అడగాలా లేదా చెప్పు !"

"ఎందుకూ ? ఎందు కడగాలీ ? అదేం దాని బాబుగారి ముల్లెటా ? నేనీ యింటికి పెద్దదాన్ని ! పైగా ఆ బొంతలో నా బంగారం లాంటి పంచె పడింది."

మాధవుడు ఊరుకోలేదు.


# ఆంధ్రపత్రిక

ఆంధ్రపత్రిక ఇప్పటికి ఇంచుమించు ఏడు దశాబ్దాలుగా తెలుగు వారికి సేవ చేస్తోంది.
విజయవాడ మరియు హైదరాబాద్ నుండి వెలువడుచున్నది.
తాజా వార్తలు, పక్షపాతం లేని వ్యాఖ్యలకి ఆంధ్రపత్రిక పెట్టింది పేరు.
ఇవి కాక అన్ని రకాల అభిరుచులనీ సంతృప్తిపరచే ఇతర శీర్షికలు ఎన్నో
మీరు ఆంధ్రపత్రికలో చదవగలరు !

★ మన సినిమాలు ★ డాక్టరు కబుర్లు ★ కలైడోస్కోపు కార్టూన్
★ దినవార ఫలాలు ★ మా ఊరి సమస్య ★ శ్రీకృష్ణభాగవతం
★ ఇది నారీదృక్పథం ★ అరణ్యకాండ ★ వింత యదార్థం
★ ఇంకా — వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు ... ...

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో సరికొత్త ఆకర్షణలు ప్రవేశపెడుతూనే ఉంటాము !

వెంటనే ఆంధ్రపత్రిక చందాదారుగా చేరండి ! మేనేజరు, ఆంధ్రపత్రిక

సీత వచ్చేసరికి వాదన జోరయింది. పక్కింటి నుంచి అప్పు తెచ్చిన నూనె గిన్నెను వెంగు చాటునుంచి తీసి వంటింట్లో పెట్టి వచ్చింది "వస్తున్నానయ్యా" అని మరిది పిలుపునకు జవాబిస్తూ.

"పన్లు అలా వుంటూనే వుంటాయిగాని వదినా! యింట్లో జరుగుతున్నదేవీఁ పట్టించుకోపోతే యెలా?"

"ఏం జరిగిందయ్యా?"

మరిది అంటే సీతకి భయం!

అతను ఎప్పుడూ పంజేసే వాళ్ళ గురించి మాట్లాడతాడు! ఆవిడకి అర్థమవని పుస్తకాలు చదువుతాడు! ఊళ్ళో ఉన్నప్పుడయినా యింటి పట్టున ఉండడు! పనిమనిషి ఉండేప్పుడు దానితో పోట్లాట వస్తే దానికే వత్తాసు! పాకీవాడికి పావలాయేం అర్ధరూపాయ యివ్వ గూడదా అంటాడు! మనకి మాత్రం ఎక్కణ్ణించి వస్తుందయ్యా అంటే మనం తినేదాన్లో ఓ మెతుకు తగ్గించుకోకూడదా అంటాడు!

భూమ్మీద ఎవరికీ హక్కు ఉండరాదని చెప్తే తన అర ఎకరం ముక్కా ఎవరో లాగేసుకుంటారని పేద రైతు పడే భయం సీత భయం!

"యిది నీ బొంత పట్టుకుపోతుందిట! ఊరుకుంటే యీ యిల్లే పట్టుకుపోతుందీ మహాతల్లి!"

"దాన్ని కాదనమను."

"అంటుందమ్మా! ఏంజేస్తావ్?"

"అసలు అననునూ! చెప్తా!"

"అను వదినా! ఏంజేస్తుందో యీవిడగారు చూద్దాం!"

సీత పెదవ్విప్పలేదు.

క్షణంసేపు చూసి —

"ఏదిరా! అనమనూ!" అంది చిట్టెమ్మ పుంజుకొని.

"మా వదిన చాలా మంచిది..."

"ఊరుకోవే! దాన్నే ఉబ్బేయ్యక్కర్లేదు! మొగుడి సొత్తుమీద దానికి ఏపాటి హక్కుందో నీ అన్నగారి సొమ్ముమీద నీకూ ఉంది ఆపాటి హక్కు! పదవే పద! నీ పన్లు చూసుకో! ఎసట్లో బియ్యం మరిగి తగులడుతున్నాయి...! మళ్ళీ అన్నయ్యొచ్చేస్తాడు...!" వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఏడుస్తున్న పిల్లను భుజాన వేసుకొని జోకొడుతూ మాలక్ష్మి కూడా అక్కడనించి కదిలింది. సీత కూడా వెళ్ళిపోబోతుంటే —

"గాలి తీసేసావేంటి వదినా?"

"యిప్పుడేమయిందయ్యా! అది తీసుకోలేదుగా!"

"అద్గదీమాట..." గొంతు పెంచబోయాడు.

"నాయన్నాయనా! ఊరుకుందూ! ఊరికినే గొడవపెట్టకు! దానికి మాత్రం తెలీదా?"

తడిపిపెట్టిన బట్టల దగ్గరకి సీత వెళ్ళింది.

## 5

నూతులకి మందులు కొట్టించటం రాఘవరావుపని. పొద్దుటే పోయి పదకొండు గంటలకి వస్తాడు. సాయంకాలం ఓ గంట పని. ఆ తర్వాత సినిమా హాల్లో బుకింగ్ దగ్గర ఉంటాడు.

ఆరోజు అతను రావటం ఆలశ్యమయింది. వచ్చేసరికి అత్తగారు సుభద్ర కూడా దిగడ్డారు. విసుగు మొహంమీద కనబడకుండా పలకరింపులు కానిచ్చేసి, స్నానానికి వెళ్ళాడు. అతను తిరిగి వచ్చేసరికి తల్లీకూతుళ్ళ మధ్య సంభాషణ సాగుతోంది.

"మన యింటా వంటా లేవిలాంటి బుద్ధులు! చెట్టంత మనిషి! స్వయానా అత్తగారు ... అంతదూరం చెప్పుకొస్తే బెల్లం కొట్టిన రాయిలా వూరుకుంటావా? ముగ్గురు పిల్లల తల్లివి! చిన్న దానివా చితకదానివా? మనిషిఅన్నాక ఒకరికి పెట్టేగుణం ఉండాలి..."

"ఏంటండీ కూతురికి బోధిస్తున్నారూ?"

సుభద్ర చటుక్కున లేచి నుంచుని —

"ఏంలేదు నాయనా! ఎండన బడొచ్చావు! వెళ్ళి భోంచెయ్యి! వదినగారు చూస్తున్నారు..."

అతను గడప దాటుతూండగానే —

"లే! వెళ్ళి అతనికేం కావాలో చూడు! ఎటునుంచి ఎటొచ్చినా దరిద్రపు బ్బుద్ధులు పుట్టింటి నించే వచ్చాయంటారు..."

రాఘవరావు కంచం ముందు కూర్చున్నాడు.

తల్లి ప్రవర్తనలో తేడా నాలుగు ముద్దలు కడుపులో పడేదాకా అతనికి తెలీలేదు.

ఎండు మావిడి టెంకల పులుసు గరిటతో తిప్పుతూ అతని కంచంలో పోస్తోంది చిట్టెమ్మ. ఆ విసురు అతనికి అర్థమవుతోంది.

"ఏంటే? అందరూ అలా వున్నారూ?"

"ఏవీఁ లేదు!"

"ఏవీఁలేకుండా ఎలా వుంటుంది! అక్కడేమో తల్లీకూతురూ గుసగుసలు! యిక్కడ నువ్విలా! అవునూ! అదేదీ?"

"అలా ఎవళ్ళింటికో వెళ్ళుంటుంది."

"దాని ప్రయాణం ...?"

"కన్నతల్లిముండను! దాన్ని యింటో ఓ పూట ఉండమనే హక్కు నాకు లేదుట్రా నాయనా?!"

రాఘవరావు మంచినీళ్ళు తాగాడు.

ఓ సెకను ఆగి—

"అమ్మా! బయట తిరిగేవాడికి యింటో ఏం జరిగిందో ఎలా తెలుస్తుందే...? నువ్వేమో నామీద గయ్ గయ్ మంటావ్వా...!"

"ఏం జరుగుతుందీ? ఏవీ జరగదు! యీవిడగారేదో మహా పనిమంతురాలయినట్టు అలా వుండూ యిలా వుండూ అన్నీతులు చెప్పడం! అదేమో ఎర్రెద్దుమాలోకంలా వినడం...! యీ బాగోతం ఎప్పుడూ ఉండేదే?"

"అందులో తప్పేం ఉందే...?"

"ఏవీం లేదు! ఏవుంటుందీ? దానిమీద యింటో అంటో అభిమానం కడుపులో ఉండేడిసిందనే ఎప్పటికప్పుడు అనుకుంటూనే వున్నా! ఆ పిచ్చిపీనుగ నామాట వణ్ణేలేదు! యీవేళ బయటపడింది దీని రంగు..."

"... ... ... ..."

"యింత బతుకూ బతికి యింటెనకాతల చచ్చినట్టు బిడ్డకు ఓ పాతగుడ్డ సీలిక యిచ్చే హక్కు కూడా లేకపోయె! నాలుగూ పెట్టుకునే భాగ్యం ఎలానూ లేదాయె! దోసిలొగ్గి 'అమ్మా! నాయనా!' అన్నిన్నూ నిన్నూ అడుక్కున్నా చెల్లనాయె! సర్లే— అన్నీకు దయ కలిగిందీ—తలూపావు! వదినా వదినా అంటూ ఓసారీ రెండుసార్లూ కాదు నాలుగుసార్లు అడిగింది అది! 'దాన్నడుక్కోవాల్సిన కర్మ నీకేం పట్టిందే' అంటే సత్తెకాలప్పిల్లగనక నన్ను కొట్టేసింది! ఇంతాజేస్తే నీ పెళ్ళాం నోట మాటే లేదు. వాళ్ళే అరుచుకుంటారూ...! వాళ్ళే పోతారూ...అని దాని భరోసా! దానికాగుంట చచ్చినాడు వత్తాసు...! 'పోనీ నద్దులేమ్మా!' అంటూనే వుందది! దాని పొగరేంటో చూద్దామనే దీని ప్రయాణం వాయిదావేయించాను...!"

"యింతకీ దేని గురించే...?"

"మహా మహా మారు భాగ్యమేంగాదు! బొంత! పాతగుడ్డల బొంత...! మళ్ళా మాన్యాలూ అయితే యింకెంత గింజుకుపోనో మహాతల్లి...!"

"అది పట్టుకెళ్ళొద్దందా?"

"ఎబ్బే! అలా ఎందుకంటుందీ? పట్టుకెళ్ళు అని మడత లెట్టి మరీ చంకనెట్టింది..."

"సర్లేస్తూ! అదే యిస్తుంది! ముందు మజ్జిగ పొయ్యి!"

మజ్జిగపోస్తూ గొంతు తగ్గించి—

"పలచబడిపోయింది! ఆవిడాహారు...తయారు..."

"ఏవిట్టు!"

"మామూలే! రోగం! ఆస్పత్రిలో చూపించుకుంటుందిట! పది రూపాయలు బస్సోడికి పారేస్తే మందూ వస్తుంది! మహా నైవేద్యమూ అవుతుంది!"

"దాన్నేమారు రమ్మను..."

సీత వచ్చేసరికి పులుసులో టెంక చీకుతున్నాడు రాఘవరావు. మనిషి సన్నం. అందుమీద పొట్ట పెద్దదిగా అవుపిస్తోంది. అలసటగా వుంది.

"రమ్మన్నార్ట!"

"కూచో..."

నాలుగు ముద్దలు జుర్రాడు.

"మీ అమ్మగరూ...?"

"పైకి అంటం అస్పత్రనే! అత్తగరి ఆరోగ్యం బావులేదు గదా! మనిషి సాయం అవసరమవుతుందేమో తెల్సుకుందామని కడుపులో వున్నట్టుంది!"

"అమ్మనడగలేక పోయావ్వా...?"

"... ..."

"మాట్టాడవేం?

"సొంత తల్లే అవనీండి—పై మనిషి మనకి బరువే! ఏదో ఉండబట్టలేక వచ్చింది! చూసింది...! వెళ్ళిపోతుంది..."

"అంతేనా...?"

బుర్ర పైకెత్తి అయోమయంగా చూసి—

"అంటే...?"

"అమ్మని అడగలేదూ అంటే ఏదో వుందన్న మాట!"

"అడిగితేమాత్రం...! బరువు మోసేది మనం! మనం చూసుకోవాలి."

"నిజవేఁ! పెద్దరికం ఉంచలేదని అమ్మయిదవదూ...?"

వెంటనే మాట్లాడలేదు సీత.

"పోన్లేస్తురూ! ఆవిడొహలా ఎలచి మనమొహలా తలిస్తే... 'అనవసరంగా రంగం చెడుతుందీ..."

"ఆవిడ ఎప్పుడయినా మరోలా తలిచిందా?"

భర్త గొంతులో భావం తన తల్లిగురించి కాదని ఆమెకి అర్థమౌతూనే వుంది.

"రుజువులూ సాక్ష్యాలూ కావాలని రొక్కిస్తే ఏం చెప్పగలను? మనిషీ మనిషీ అన్నాక వందవస్తాయి! పోతాయి! అవన్నీ పట్టుకు యింట్లోవున్న పెద్దావిడ పిల్లల మంచి చెడ్డలు చూడదని నేను అనుకుంటున్నానా? అలా ఏనాడయినా అన్నానా?"

రాఘవరావు చేతిలో టెంక పారేసి చెయ్యి కడుక్కున్నాడు. గ్లాసులో నీళ్ళు పోసింది సీత...!

ఖాళీగ్లాసు కిందపెడుతూ—

"ఆవిడా చెడ్డది కాదు! నువ్వూ చెడ్డదానివికాదు! యింట్లో జరుగుతున్నదేంటో తెలుసుకోలేని చవట దద్దమ్మను కాను నేను! అది అడిగింది. బుద్ధితక్కువై పోయింది ... పొరపాటయిపోయింది... వూఁ అన్నాను! యిహనెప్పుడూ అన్నని నిన్నడక్కుండా ఏవీఁ చెయ్యనని చెంపలు వాయించేసుకోమంటావా చెప్పు!"

ఉన్నట్టుండి తుఫానులా మారిపోవటం రాఘవరావు స్వభావం! అంత నిదానమూ ఏమయిపోతుందో అంతుబట్టదు! సీత పెళ్ళయిన కొత్తలో ఒకటి రెండుసార్లు జ్వరపడింది కూడా! రాను రాను అలవాటయింది!

"నామాట వినండి! బయట అమ్మకూడా వుంది..."

"ఉంటే...? ఏం? నాకేం...అమహా?"

అన్నాడేగాని రాఘవరావు గొంతు కొద్దిగా తగ్గింది.

"మీకు పుణ్యం ఉంటుంది! కొంచెం ఓపిక పట్టండి..."

కోపం అణుచుకోటంలో కణతలు అదురుతున్నాయి! అదుగు పెదవి వణుకుతోంది.

"తిరిగి తిరిగి చచ్చి చచ్చి వస్తాను! దిక్కుమాలిన పెంటంతా యింటోనే! ఎవరి కెవ్వరూ తీసిపోరు..."

రాఘవరావు లేచాడు.

యిల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఆ గదిలోనే ఓ వార చాపమీద మాధవుడు పడుకున్నాడు! అతని చేతిలో 'ఆస్తీ దాని స్వరూపాలు' పుస్తకం ఉంది. చిట్టెమ్మ గుమ్మం పాదిగిటను ఓ చెయ్యినేల చన్ను పెట్టుకొని మరోచెయ్యి గడ్డంకింద చేర్చుకుని కూర్చుంది. సుభద్ర తలుపువారగా నించుంది. సీత వంట గదిలో ఎంగిలికంచం తీస్తోంది.

కాస్సేపు గదిమధ్య పచార్లు చేసాడు రాఘవరావు! బయట నుంచి వచ్చిన మాలక్ష్మికి అక్కడి పరిస్థితి బోధపడలేదు. లోపలికి అడుగు పెడుతూనే పెద్దగొంతుతో—

"ఏవిరా! అన్నయ్యా! యీవేళ రాటం ఆలశ్యమయిందీ...?"

"ఆ బొంత ఎక్కడుందో చూసి నీ పెట్లో పెట్టుకోవే...!"

"అదేం కుదర్దు!" మాధవుడు లేచి కూర్చున్నాడు.

"యీ విషయంలో జోక్యం చేసుకోకురా!"

"ఏం? ఎందుకుట? కష్టపడింది ఆవిడ...! దానిమీద హక్కు పూర్తిగా ఆవిడదే!"

"నాయన్నాయనా! నువ్వూరుకుందూ...! పరాయోళ్ళకైనా పెట్టుకుంటే పుణ్యమే వస్తుంది...! మంచే మిగుల్తుంది! అలాంటిది సొంత ఆడబడుచు..."

"అవునవును! బొంతకు బదులు బొంతడు పుణ్యం! గుంట వెధవలు రాత్రంతా చలికి వణుకుతూ ఏడుస్తుంటే బస్తాల్లో లారీల్లో మరీ వస్తుంది పుణ్యం...! అదే మిగుల్తుంది!"

"మాధవా! నీ వ్యవహారం శృతిమించుతోంది..."

"వస్తువ ఆవిడది! దానం చేసేది నువ్వు! పట్టుకెళ్ళేది అది! శృతిమించేది నేను...!"

"దాంది దాందంటున్నావు! అసలా బొంతలో దాందేముంది? చిరిగిన చీరముక్కలో రెండు! ఆమాత్రం నాదీ వుంది అందులో..."

"వుంది వుంది...! గా...ట్టి పంచె! ఆయందేమో మాం...చి లుంగీ! నాదే...మో నిన్నే కుట్టిన చొక్కా! యింకేం? పట్టండి! చించేద్దాం! అందరం తలోముక్కా తీసేసుకుందాం...!"

"నీ తిక్కా లెక్కా నా దగ్గర కుదరవురా అబ్బాయ్! అయినా చెల్లెలిమీద పగేంటిరా నీకూ...?"

"పగకాదు! న్యాయం! శకుంతంది...? కొని...కొత్తదే యియ్యి! బొంతేం...ఖర్మ? డన్‌లప్ బెడ్డే యియ్యి!"

"పాత బొంతకే గతిలేదూ! డన్‌లప్ బెడ్డొహటి! మొగుడి సొమ్ము పరాయోళ్ళ పాలవుతుందని—ఆ శక్తి నిజంగా ఉన్నరోజున మాత్రం—మీ వదిన ఉరెట్టేసుకోదా?"

"దానికీ దీనికీ పూటా పెట్టకు! యిది ఆవిడ శ్రమపడి అమర్చుకొన్న వస్తువ! అందుకే ఆవిడ అనుమతి లేకుండా ఆవిడతో ఆలోచించకుండా యిష్టం వచ్చినట్టు చేసే హక్కు నీకు లేదు!"

"యిది నేనూ అదీ కలిసే ఆలోచించాం!"

"అబద్ధం! ఆవిణ్ణి చెప్పమనూ ఆ మాట!"

"నేనేం నీకు జవాబుదారీ కాదు..."

"నువ్వు బెదిరించొచ్చు! తన్నొచ్చు! ఆవిడ ఏంటనుకుంటోందో తెల్సుకోకుండా ఆవిడచేత అబద్ధమాడించొచ్చు! మధ్యలో నాలాంటాడు కలగజేసుకుంటే...నాలుగు వెయ్యొచ్చు! మాటల గారడీతో మభ్యపెట్టొచ్చు! కాని...నిజం...నిజవేఁ!

"ఏవిఁట్రా! బోడి నిజం! ఆ మాటకంటూ వస్తే యింటికి పెద్దదాన్ని నేనూ...! ఏం చెప్పటానికయినా చెయ్యటానికయినా హక్కునాదీ...! ఎవడు కాదంటాడో రమ్మనూ...!"

"రైటే ఎవ్వరూ కాదనరు! యింట్లో చిల్లుకుండలమీదా బొక్కి రాచిప్పలమీదా అన్నింటిమీదా హక్కు నీదేనమ్మా! శ్రమపడి తయారుచేసుకున్నది ఆవిడకి దక్కకుండా ఆవిడ యిష్టాయిష్టాల ప్రమేయం లేకుండా...లక్కునే హక్కుమాత్రం నీగ్గాదు వాడిగ్గాదు ఆ భగవంతుడిగ్గాడా లేదుగాక లేదు! అవుతే అలా లాక్కునే హక్కు కూడా న్యాయమేనంటే చట్టమేనంటే..."

"సీతా! సీతా!"

భర్త గావుకేకల్తో గుమ్మం చాటుగా వంటగదిలోవున్న సీత అక్కడికి వచ్చింది.

"ఆ ముష్టిబొంత మాలక్ష్మికి యివ్వటం నీకు యిష్టమేనని నేను అంటున్నాను...అవునా? కాదా?"

"అవుననే అంటుంది! నువ్వు అడిగే తీరులో ఆ బొంత యిప్పించెయ్యాలన్న పట్టుదలే వుందిగాని...నిజం తెల్సుకోవాలన్న కోరికలేదు."

"పోన్లెండా! నాగురించి యింత గొడవెందుకూ? ఊరుకోండి" అంది మాలక్ష్మి.

ఎవ్వరూ కాస్సేపు మాట్లాడలేదు

మాధవుడే అన్నాడు.

"యీ విషయం గురించి యింతగొడవ అక్కర్లేదు! నిజానికి మనం అందరం పొరపాటు ఆలోచనలే చేస్తున్నాం! ఆవిడ ఆ బొంతను యిచ్చెయ్యటం...నీమీద గౌరవమంటావు నీవు! యింటి పెద్దరికం నిలబెట్టి తన హక్కును ఒప్పుకోడమంటుంది అమ్మ! మంచితనమనీ, పుణ్యమనీ అంటారు వాళ్ళ అమ్మగారు! యింటి ఆడ బడుచునీ ఏదయినా పట్టుకెళ్ళొచ్చనీ అనుకుంటుంది చెల్లి!

కాని...బిడ్డల బాధ చూడలేక, నెలలు నిండుతున్నా, సమయం లేకపోయినా, అలా అలా తొరట్లాడుతూనే ఆ బొంతను కుట్టుకొన్నది వదిన! ఆవిడ శ్రమగురించి, ఆవిడ పడిన ఆశగురించి మనలో ఒక్కరు ఒక్క సెకను ఆలోచిస్తే యింత రాద్ధాంత సిద్ధాంతాలు జరగవు! యింత పట్టుదలలు పెరగవు ...!"

ఎవ్వరూ మాట్లాడలేదు!

సీత అంది...

"తీసుకెళ్ళు మాలక్ష్మీ నేను మళ్ళీ కుట్టుకుంటాను..."

"యిదీ! యింత జరిగాక..." చిట్టెమ్మగారు అక్కడనుంచి వెళ్ళిపోయింది.

ఆ రోజు సాయంకాలం ఎవ్వరూ లేనప్పుడు మరిదితో అంది సీత...

"నువ్వు చెప్పిన హక్కులూ గొడవలూ నాకేం తెలీదు గాని మాధవా...! యీ బొంతను దానికిచ్చెయ్యటం ఓ పెద్ద పనికాదు. యిప్పుడంటే నెలల్నిండిన మనిషిని! రేపు చులాగ్గా ఉన్నపుడు మళ్ళీ ఓ బొంత కుట్టుకోడం పెద్ద లెక్కల్లో పనిగాదు. అయితే...

మనవి అతుకుల బొంతల బతుకులు! పిసరంత ఉన్నా దాని కోసమే కొట్లాటలూ, పుణ్యాలూ, ఏడుపులూ అన్నీను! ఏదయినా ఉబ్బరన వస్తుందా అన్నదే మనం చూస్తాం! మాలక్ష్మికి యిమ్మ చేసుకోడం చాతవదు! పెద్దవాళ్ళంటే వాళ్ళ కాలం ఎలాగో చెల్లిపోయింది. దీనికి చిలక్కి చెప్పినట్టు చెప్పాను. మీ అమ్మగరు అడ్డు పడుతూనే వచ్చారు! అయ్యో! అదేం పాడుబుద్ధితో అంటంలేదూ! వన్నేర్చుకోమంటోందీ...అని ఆవిడ అనుకోరు!

యిన్నేళ్ళు బాధపడ్డ పిల్లలు యీ ఒక్క ఏడూ ఇబ్బందిపడితే పడతార్లే అని యిచ్చేద్దామనుకున్నాను. కానీ...దానికి పంతంరావాలీ... పని నేర్చుకోవాలీ...అని సూచా వాచా చెబుతూ వచ్చాను! కానీ..."

అన్ని వాదనలూ ఆ గదిలోనే జరుగుతున్నాయి ప్రస్తుతం ;

---

# రాజమరాళి

## శ్రీ కె. బాలసుబ్రహ్మణ్యం

చిడత భజనల్లో
చిత్తకార్తె కుక్కల్లా
కారుకూతలు కూస్తే
కూత కూతా కొత్త పుంతలు తొక్కిందని
సంబరపడిపోయి
చంకలు బాదుకొనే
ముష్కర సంగీత రసాస్వాదనా "తుష్కరులూ"—
నీరో దొరగారి నికార్సైన వారసులూ
ఉన్నంతవరకు ...
రోమ్ తగలడుతూనే ఉంటుంది
అందుకనే
నీరింకిన హరివిల్లు
నీలాంబరంలో
నీరుగారిపోయింది
సప్తస్వర మాలికాలంకృత రాజమరాళి
సజీవ సమాధిలో
తప్తమై పోయింది.